క్లుప్తంగా

కార్యదర్శిపై విచారణకు ఆదేశం

వట్‌పల్లి(అందోల్): వైన్‌షాపు ఏర్పాటు విషయంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసి అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై డీపీఓ స్పందించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శిపై విచారణకు ఆదేశించారు. మండల కేంద్రం వట్‌పల్లికి మంజూరైన వైన్స్ షాపును ఏర్పాటు చేసే విషయంలో పంచాయతీ కార్యదర్శి ఓ భవనాన్ని పరిశీలించారు. ఇది వట్‌పల్లి పంచాయతీ పరిధిలోనిదే అన్నట్లు ధ్రువపత్రం జారీ చేశారు. ఆ భవనంలో నిర్వాహకులు షాపు ఏర్పాటు చేశారు. అయితే, ఆ భవనం గౌరైకల్ శివారులో ఉండడంతో కొందరు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వైన్స్‌షాపు ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. పంచాయతీ కార్యదర్శి తప్పుడు ధ్రువపత్రం సృష్టించి అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపిస్తూ జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఈనెల 12న విచారణకు ఆదేశించారు. కార్యదర్శి సయ్యద్ అహ్మద్‌ను విచారణకు పిలవగా తాను ఆ ధ్రువపత్రం జారీ చేయలేదని, తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని అంటున్నాడని ఇన్‌చార్జి ఎంపీఓ ఖాజా నాసిరొద్దీన్ తెలిపారు.

విరబూసిన బ్రహ్మకమలాలు


బ్రహ్మకమలాలు అందిస్తున్న భక్తుడు

ఝరాసంగం(జహీరాబాద్): హిమాలయాల్లో లభించే బ్రహ్మకమలం పుష్పాలు మండలంలోని పొట్టిపల్లిలోని భీమ్‌రావు కుల్‌కర్ణి ఇంట్లో బుధవారం విరబూశాయి. దీంతో వారు ఇంటి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ఒకేసారి తొమ్మిది పుష్పాలు పూయడంతో ప్రతి ఒక్కరిని కనువిందు చేశాయి. గురువారం బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్‌ను కలిసి బ్రహ్మకమలాలు అందజేశారు.

నిబంధనలు తప్పనిసరి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్క అధికారి విధులు నిర్వహించాలని ఎంపీడీఓ హరినందన్‌రావు ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గురువారం మండలంలోని అల్లాపూర్, చిన్నచల్మెడ గ్రామంలో శానిటేషన్, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వ్యాధుల సీజన్ నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

జెన్‌కో ఉద్యోగుల నిరసన

పుల్‌కల్(అందోల్): రామగుండంలోని థర్మల్ విద్యుత్ కేంద్రంలో నిర్మిస్తున్న విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో కాకుండా జెన్‌కోతో మాత్రమే నిర్మించాలని కోరుతూ గురువారం సింగూరు జెన్‌కో విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెన్‌కో ఉద్యోగ సంఘం నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం రామగుండంలో 800 మెగా వాటాలతో సింగరేణి, యాజమాన్యం, జెన్‌కో యాజమాన్యం భాగస్వామ్యంతో విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించ తలపెట్టిందన్నారు. పూర్తిగా జెన్‌కో భాగస్వామ్యంతోనే నిర్మించాలని పేర్కొన్నారు.

పంటలకు పరిహారం చెల్లించాలి


మినుము పంటను చూపిస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాలని మొగుడంపల్లి మండలం సజ్జారావుపేట తండా గిరిజన రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మినుము, పెసర, కంది, సోయా పంటలను అధికంగా సాగు చేశామన్నారు. భారీ వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని వాపోయారు. కోత దశలో ఉన్నప్పుడు వానలు పడడం వల్ల పంటలు చేతికి అందే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టామని, అప్పులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కనీస వేతనాలివ్వాలి

సంగారెడ్డి టౌన్ : పరిశ్రమల్లో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. సంగారెడ్డి మండలంలో క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో ఆటో జాతర కార్యక్రమంతో మండలంలోని వివిధ పరిశ్రమల్లో ప్రచారం చేశామన్నాని తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ఇలా.. బోర్డు అలా!

నిర్మాణం పూర్తి కాకుండానే.. బోర్డు ఏర్పాటు

- కంకర వేసి అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్
- బోర్డును చూసి ఆశ్చర్యానికి గురవుతున్న గ్రామస్తులు


కంకరవేసి అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు


పని పూర్తి చేసినట్లు కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన బోర్డు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అధికారులు, కాంట్రాక్టర్ తీరును చూస్తుంటే.. 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు!' అనే కృష్ణశాస్త్రి కవిత గుర్తుకొస్తోంది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఇశ్రితాబాద్ గ్రామంలో 0.880కిలోమీటర్ల బీటీ రోడ్డును రెన్యూవల్ చేసేందుకు, ప్రభుత్వం రూ. 18లక్షల ఎంఆర్ఆర్ నిధులను మంజూరు చేసింది. రోడ్డు పనులను ఎస్వీఆర్ ఇన్ఫ్రా డెవలపర్స్ వారికి అప్పగించగా, వారు సెప్టెంబర్ 2023లో పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించి సంవత్సరం గడుస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కేవలం రోడ్డుపై కంకర వేసి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వాహనదారులు, ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ఈనెల 15 వరకు రోడ్డు పనిని పూర్తి చేసినట్లు సంబంధిత కాంట్రాక్టర్ సైన్ బోర్డును ఏర్పాటు చేయడం గమనార్హం. దీంతో బోర్డును చూసిన వాహనదారులు, గ్రామస్తులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, ఉదాసీనత వైఖరి ప్రజలకు శాపంగా మారింది. అసంపూర్తిగా వదిలేసినా పనిని పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఏర్పాటు చేసిన బోర్డును తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్‌నే అందిస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: నిరంతరం నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఖేడ్ మండలం హన్మంతరావుపేట విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి, సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షం, ఈదురుగాలులు వల్ల కొంత అంతరాయం ఏర్పడుతుంది. మిగతా సమయాల్లో నిరంతరంగా విద్యుత్తు సరఫరా అవుతుందని స్పష్టం చేశారు. అనంతరం మక్తలక్ష్మాపూర్‌కు చెందిన సుశీలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.70వేల ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా భవిష్యత్తులో శాశ్వత ఎంవీఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించి, రవాణాశాఖ సేవలు మరింత విస్తృతంగా అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. గురువారం ఎంవీఐ సేవల కోసం జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. త్వరలోనే వారానికి రెండు రోజుల పాటు ఎంవీఐ సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, నాయకులు రమేష్ చౌహాన్, శంకర్, తాహెర్ ఉన్నారు.

ఎత్తిపోతల వద్ద పర్యాటకుల సందడి


ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు

జహీరాబాద్ టౌన్: భారీ వర్షాలకు జాడిమల్కాపూర్ వాటర్ ఫాల్(ఎత్తిపోతల)కు జలకళ సంతరించుకుంది. చూసేందుకు పర్యాటకులు తరలి రావడంతో సందడి నెలకొంది. తెలంగాణ-కర్నాటక రాష్ట్రాల సరిహద్దులో జాడిమల్కాపూర్ గ్రామానికి సమీపంలో వాటర్ ఫాల్ ఉంది. ఎడతెరిపి లేకుండా ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడడం వల్ల ఎత్తిపోతలకు భారీగా వరదనీరు వస్తుంది. కొండల మధ్య నుంచి పెద్ద లోయలోకి నీరు జారి పడుతూ ఆకర్షణీయంగా ఉంది. పర్యాటకులను నీటి లోపలికి వెళ్లొదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఎంఎల్‌హెచ్‌పీలపై వేధింపులు ఆపాలి

- ఏఐటీయూసీ నేత ప్రసాద్


గాయత్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

సంగారెడ్డి, ఎడ్యుకేషన్: ఎంఎల్‌హెచ్‌పీలపై వైద్యాధికారుల వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోయిని ప్రసాద్ అన్నారు. గురువారం సంగారెడ్డిలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల వీడియో కాల్ అటెండెన్స్ సవరించాలని కోరుతూ జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి చంద్రకళ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడారు. ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు పని చేస్తున్న చోట భద్రతా లోపం ఉందని వాపోయారు. పోకిరిలు మద్యం తాగి వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, సెక్యూరిటీని కల్పించాలని కోరారు. ప్రైవేట్ భవనాల్లో పల్లె దవాఖానాలు నడుస్తున్నాయని, వీటిలో కరెంట్ బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఎంఎల్‌హెచ్‌పీల వైద్యులు చెల్లిస్తూ విధులు కొనసాగిస్తున్నారని తెలిపారు. అధికారుల తీరు మార్చుకోకుంటే రాష్ట్రస్థాయిలో పోరాటం తప్పదని హెచ్చరించారు.

ముచ్చర్ల గ్రామం సందర్శన

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం ముచ్చర్ల గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా గురువారం సందర్శించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, మురికి కాల్వలు, పారిశుద్ధ్యంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురికి కాల్వలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అతని వెంట ఎంపీఈఓ యూసుఫ్ తదితరులున్నారు.


పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సాయిబాబా

సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలి

- పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతిరావు


పనులను పరిశీలిస్తున్న ఈఈ తిరుపతిరావు

జోగిపేట(అందోల్): అందోల్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలని పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతిరావు సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం పెద్దచెరువు వద్ద కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ పనులకు ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నుంచి రూ.2.50 కోట్ల మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కట్ట వెడల్పు పనులను ప్రారంభించారు. మొరం, గ్రీనరీ, లైటింగ్, వాకింగ్ ట్రాకింగ్ పనుల్లో వేగం పెంచాలన్నారు. పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. చెరువు కట్ట మీదుగా రోడ్డును ఏర్పాటు చేసేందుకు అవసరమైన పనులను చేపడుతున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఏఈ సాయి ప్రణీత్, జూనియర్ అసిస్టెంట్ పండరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ ఉన్నారు.

స్వచ్ఛతపై వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

నారాయణ ఖేడ్: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం 'స్వచ్ఛత' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ జగ్జీవన్ పచ్చదనం, పరిశుభ్రత, స్వచ్ఛత, తడి, పొడిచెత్త వేర్వేరు చేసి చెత్త తరలించే ఆటోల్లో వేయడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పించాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

కంగ్టి(నారాయణఖేడ్): స్వచ్ఛతతోనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ సత్తయ్య అన్నారు. మండలంలోని దెగుల్‌వాడి గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బందితో మురికి కాల్వల్లోని పూడికను తీయించారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

లోక్ అదాలత్‌తో ప్రయోజనం

- ఎస్ఐ నాగలక్ష్మి

పటాన్‌చెరు టౌన్: మెగా జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిన్నారం ఎస్ఐ నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 28న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉంటుందని సివిల్, క్రిమినల్, యాక్సిడెంట్ కేసులు, కక్షిదారులు రాజీపడాలని తెలిపారు. చిన్నచిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బులు చేసుకోవద్దని సూచించారు. లోక్ అదాలత్‌తో బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని తెలిపారు.

కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి, సంక్షేమం

- సీనియర్ నాయకుడు ఉజ్వల్‌రెడ్డి


మాట్లాడుతున్న ఉజ్వల్‌రెడ్డి తదితరులు

జహీరాబాద్ టౌన్: కాంగ్రెస్ అంటే అభివృద్ధి, సంక్షేమమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి అన్నారు. ఈ గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధుల మంజూరు కాగితాలకే పరిమితమైయ్యాయని, ఎక్కడ కూడా అభివృద్ధి పనులు జరగలేదని దుయ్యబట్టారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి కృషి వల్ల నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు వంద కోట్లు మంజూరు చేయించారని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. శేఖాపూర్ రోడ్డు మరమ్మతులకు గత ప్రభుత్వ హయాంలో నిధుల మంజూరైన విడుదల చేయలేదన్నారు. బుర్దిపాడ్, బూచినెల్లి, సత్వార్, చిరాగ్‌పల్లి గ్రామ పరిధిలో నారింజ వాగుపై చెక్‌డ్యాంల నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ తరఫున రూ. 35 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. నారింజ ప్రాజెక్టులో పూడికతీత పనుల కోసం రూ. 5 కోట్లు, మండలంలోని పలు పంచాయతీ రాజ్ రోడ్ల మరమ్మతులకు రూ. 27 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. మొగుడంపల్లి మండలంలోని గుడ్‌పల్లి, గోపన్‌పల్లి, జహీరాబాద్ టౌన్‌కు మూడు కొత్త 11 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆగిన మోడల్ కూరగాయల కాంప్లెక్స్ బిల్లుల బకాయిలను మంత్రి దామోదర్ త్వరలో విడుదల చేయనున్నట్లు చెప్పారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మంత్రి దామోదర్ రాజనర్సింహ్మాపై అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మంకాల్ సుభాష్, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా గర్జనను జయప్రదం చేయండి

- జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేశ్


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత మహేశ్

జోగిపేట(అందోల్): హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నేడు (శుక్రవారం) జరగనున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి మహాగర్జన సభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేశ్ కోరారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్య రంగం సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ. 3 వేలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సభకు వేలాదిగా విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జోగిపేట్ మండల్ కార్యదర్శి హరిప్రభ, నాయకులు, శ్రీను, విష్ణువర్ధన్, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మండల విద్యాధికారిగా గోవింద్‌రెడ్డి గురువారం ఎంఈఓగా బాధ్యతలను స్వీకరించారు. ప్రభుత్వం అన్ని మండలాల సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓలుగా అవకాశం కల్పిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కావున, గోవింద్‌రెడ్డికి మండల విద్యాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

◆ అన్యమత ఉద్యోగులు వద్దు

కంగ్టి(నారాయణఖేడ్): హిందూ దేవాలయాల్లో ఇతర మతాలకు చెందిన ఉద్యోగుల నియామకాలను చేపట్టొద్దని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ విష్ణుసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం కంగ్టి మండల పరిరక్షణ సమితితో పాటు ఖేడ్ సభ్యులు కలిసి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పలు డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. దేవాదాయ శాఖను తొలగించి సాధు, సంతులతో సనాతన ధర్మ పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ కల్తీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పెద్ద కంజర్ల గ్రామ సమీపంలోని తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల (పురుషుల)లో 2024 – 25 సంవత్సరానికి బీఎస్సీ(ఎంపీసీ, ఎంఎస్సీఎస్ , ఎంఎస్డీఎస్, బీజెడ్సీ, బీ.కాం (సీఏ),(హానర్స్) గ్రూపుల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి – సంగారెడ్డి రీజినల్ కోఆర్డినేటర్ సుధాకర్, ప్రిన్సిపాల్ మహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ దంతాలను రక్షించుకోవాలి

జోగిపేట(అందోల్): చిన్నప్పటి నుంచే దంతాలను శుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలని లయన్స్‌క్లబ్ జిల్లా సెక్రటరీలు డాక్టర్ అనంతరెడ్డి అన్నారు. గురువారం జోగిపేటలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆహార పదార్థాల వల్ల కూడా దంతాలు చెడిపోయే అవకాశం ఉందన్నారు. దంత వైద్య నిపుణులు డాక్టర్ జాన్‌పాల్ మాట్లాడుతూ.. ప్రతి రోజు దంతాలను రెండు సార్లు శుభ్రం చేసుకోవాలని, స్వీట్లు, చాక్లెట్లు తీసుకోవద్దని సూచించారు.

◆ పీడీ నర్సింలు మృతి

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన పీడీ నర్సింలు(49), గత కొన్ని సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. కోహీర్ మండలం గురుజువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొన్ని నెలలుగా పీడీగా పని చేస్తున్నారు.

◆ కల్వర్టు పరిశీలన

న్యాల్‌కల్(జహీరాబాద్): వర్షాలకు మండలంలోని రాఘవాపూర్-కుస్నూర్ రోడ్డుపై గల కల్వర్టు కోతకు గురై కొంతభాగం కొట్టుపోయింది. గురువారం తహసీల్దార్ భూపాల్, ఎంపీడీఓ రాజశేఖర్, ఎంపీఓ సురేష్ పరిశీలించి, రాకపోకలను నిలిపేశారు.

◆ ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఏడుగురు వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ వివరాల ప్రకారం.. నిందితులను సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.


న్యాల్‌కల్(జహీరాబాద్): హద్నూర్‌లో..


కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టిలో..


వట్‌పల్లి(అందోల్): కన్‌సాన్‌పల్లిలో..

చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని గురువారం ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గడిలపై గళమెత్తి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలిన వీర మహిళా చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.


పటాన్‌చెరు టౌన్: నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్


సంగారెడ్డి: నివాళులర్పించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్


సంగారెడ్డి, ఎడ్యుకేషన్: గొల్లపల్లిలో నివాళులర్పిస్తున్న రజక సంఘాల నాయకులు


పటాన్‌చెరు: చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


నారాయణఖేడ్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


రామచంద్రాపురం పట్టణంలో..